సాక్షి తిరుపతి

సోమవారం । 14 । ఆగస్టు । 2023



ఉత్సాహంగా 3కే రన్

ఏపీఎల్ సీజన్-2లో పాల్గొనే క్రీడాకారులకు మద్దతుగా ఆదివారం తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. - 8లో



తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదం

తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో ఆదివారం ఓ కారు అదుపు తప్పి పిట్టగోడను ఢీకొంది. ఎవరూ గాయపడలేదు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	25
చిత్తూరు	36	25
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	36	26

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు శిలాతోరణం వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 82,265 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 41,300 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.82 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

అంతర్జాతీయ పోటీలకు అఖిలేష్, దీక్షిత



అఖిలేష్



దీక్షిత

తిరుపతి ఎడ్యుకేషన్ : స్వీడన్‌లో ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు భారత జట్టు తరపున అఖిలేష్, దీక్షిత పాల్గొననున్నారు. ఆదివారం ఈ మేరకు రాష్ట్ర కర్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వై.వెంకటేశ్వరమ్మ, కార్యదర్శి వై.మోహన్, కోచ్ ఎం.సురేంద్రరెడ్డి తెలిపారు. తిరుపతి సమీపంలోని శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అఖిలేష్, వైఎస్సార్ కడప జిల్లా, కమలాపురం గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దీక్షిత జాతీయ స్థాయి కర్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ చాటి జాతీయ జట్టులో స్థానం సాధించినట్లు పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజల సౌకర్యార్థం అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఎస్వీయూ క్యాంపస్‌లో అప్రమత్తం



ఎస్వీ వెటర్నరీ కళాశాల హాస్టల్ వద్ద హెచ్చరిక బోర్డు

తిరుపతి సిటీ : తిరుమల నడకదారిలో రెండు రోజుల క్రితం జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని అటవీశాఖ, ఎస్వీయూ అధికారులు అప్రమత్తమయ్యారు. శేషాచల అడవులకు సమీపంలో ఉన్న తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ, ఎన్జీ రంగా అగ్రికల్చరల్ కళాశాల ప్రాంగణంలోని హాస్టల్స్ , ప్రధాన గేట్ల వద్ద ఆదివారం నుంచి సెక్యూరిటీని పెంచారు. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యార్థులు రోడ్లపై తిరగరాదని నోటీసులు అంటించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని పేర్కొన్నారు. చిరుత సంచరించే అవకాశమున్న ప్రతి చోటా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రతి గేటు వద్ద సెక్యూరిటీ గార్డును నియమించారు. గత ఏడాది వర్సిటీ ప్రాంగణంలో చిరుత సంచరించిన నేపథ్యంలో మరింత కట్టుదిట్టంగా భద్రత కల్పించారు.

జాలర్ల సంరక్షణలో చేపపిల్లలు



జిల్లా మత్స్యశాఖ కార్యాలయం వద్ద తొట్టెల్లో చేపపిల్లలను వదులుతున్న సిబ్బంది

తిరుపతి అర్బన్ : తూర్పుగోదావరి జిల్లా నుంచి తీసుకువచ్చిన 70లక్షల చేపపిల్లల సంరక్షణ బాధ్యతను ఆదివారం జాలర్లకు అప్పగించారు. సుమారు 40 నుంచి 45 రోజులపాటు చేపపిల్లలకు దాణా వేసి పెంచిన తర్వాత చెరువుల్లో విడిచిపెట్టనున్నారు. తొలిదశలో వచ్చిన మొత్తం చేపపిల్లల్లో జిల్లా మత్స్యశాఖ కార్యాలయ ప్రాంగణంలోని తొట్టెల్లో 15 లక్షలు, అరణియార్ వద్ద మత్స్య పెంపక కేంద్రంలో 25లక్షలు, కల్యాణి డ్యామ్ వద్ద తొట్టెల్లో 30లక్షలను వదిలిపెట్టారు. రెండో దశలో ఈ నెల 20వ తేదీన తిరుపతిలో 30లక్షలు, అరణియార్‌లో 40లక్షలు, కల్యాణీడ్యామ్ వద్ద 60లక్షల చేపపిల్లలను వదిలిపెట్టనున్నారు.

100 శాతం ఉపాధి!

దక్కిలిలో జోరుగా సాగుతున్న ఉపాధి హామీ పనులు





'ఉపాధి లేదని ఏ ఒక్కరూ వలసలు వెళ్లరాదు. ఉన్న ఊర్లోనే ఉపాధి చూపాలి. సీజన్ ఏదైనా.. లబ్ధిదారులు కోరిన సమయంలో పనిచూపించాలి' ఇదే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఇప్పటికే వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశాయి. జాబ్‌కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుకీ వంద రోజులు పని కల్పించడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నాయి. ఈ మేరకు ఉపాధి లక్ష్యం వైపు దూసుకెళ్లే విధంగా అధికారులకు దిశానిర్దేశం చేశాయి. ఇందులో భాగంగానే జిల్లాలో ఉపాధి పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తి చేసి.. రాష్ట్రంలోనే జిల్లా తృతీయ స్థానంలో నిలవడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- జిల్లాలో జోరుగా ఉపాధి పనులు
- లక్ష్యం వైపు దూసుకెళ్తున్న అధికారులు
- వలసల నివారణే లక్ష్యంగా అడుగులు
- ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేందుకు సరికొత్త ప్రణాళికలు
- హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు

దక్కిలి: జాబ్‌కార్డులు కలిగిన ప్రతి లబ్ధిదారుకీ వంద రోజులు పనికల్పించేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఊర్లోనే ఉపాధి పనులు చూపిస్తూ లక్ష్యం వైపు దూసుకెళ్తున్నారు. జిల్లాలో లక్ష 45 వేల కటుంబాల పరిధిలో 4 లక్షల 72 వేల మందికి జాబ్‌కార్డులుండగా.. ఇందులో ఎస్సీలకు 38.97 శాతం, ఎస్టీలు 3.7 శాతం, మహిళలు 57 శాతం మందికి పనులు కల్పించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.176.08 కోట్ల మేర ఖర్చుచేశారు. ఒక్కొక్కరికీ రోజుకి రూ.260 తగ్గకుండా కూలీ అందిస్తున్నారు.

పారదర్శకంగా పనులు

ఉపాధిహామీ పనులను జిల్లా అధికారులు పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. పనులు జరిగే సమయంలో కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా నమోదు చేస్తునఆనరు. అక్కడే ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. మాస్టర్ వెరిఫికేషన్, ర్యాండమ్ చెక్ చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ మాస్టర్ మెజర్‌మెంట్ సిస్టం, క్వాలిటీ కంట్రోల్ వింగ్ ర్యాండమ్‌గా పనులు చెక్ చేస్తున్నారు. లబ్ధిదారుల ఆధార్‌ను అనుసంధానం చేసిన బ్యాంక్ అకౌంట్, పోస్టాఫీసు అకౌంటక్‌లో కూలి డబ్బులు జమచేస్తున్నారు. సామాజిక తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.



ఉపాధిహామీ పథకం కింద సంగనపల్లెలో సాగు చేస్తున్న నిమ్మ

పనులు ఇలా..

నీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వర్షపు చినుకులను వడిసిపట్టే పనులైన చెరువులు, కుంటల్లో పూడికతీత, ఫాంపాండ్స్, ట్రెంచెస్, ఇతర నీటి నిల్వ పనులతో పాటు మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా పండ్ల తోటల పెంపకం పనులు చేపడుతున్నారు. గుంతలు తీయండ, మొక్కలు నాటడం, ఎరువులు వేయడం తదితర పనులు చూపుతున్నారు. ఇందుకు మూడేళ్లుగా ప్రభుత్వం ఎకరాకు రూ.లక్షకుపైగా చెల్లిస్తోంది.

వలసల నివారణే లక్ష్యం

జిల్లా నుంచి ఎవ్వరూ ఇతర ప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్లకూడదన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం సీజన్ల వారీ పనులు చేపడుతున్నారు. వర్షాకాలంలో ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నారు.

జిల్లా సమాచారం

జాబ్‌కార్డులు కలిగిన లబ్ధిదారులు 4.72 లక్షలు	ఈ ఏడాది లక్ష్యం కోటి 5 లక్షల పనిదినాలు
నాలుగు నెలల్లో చేసిన పనిదినాలు 68 లక్షలు	ఖర్చుచేసిన మొత్తం రూ.176.08 కోట్లు
వంద రోజులు పనిపూర్తిచేసిన కుటుంబాలు 6,300	

ఉపాధిహామీ పథకం ఆసరాగా ఉంది



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మా కుటుంబంలోని సభ్యలందురూ రోజూ పనికెళ్తున్నారు. ఉపాధి నగదు కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం.

– పిల్లి సక్కుమ్మ, ఉపాధి కూలీ, దక్కిలి

ఎంతో మేలు



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వల్ల ఎంతో మేలు జరుగుతోంది. సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ పనిదొరుకుతోంది. కూలి డబ్బులు సకాలంలో అందుతోంది.

– ఎస్.నారాయణమ్మ, ఉపాధి కూలీ, సంగనపల్లి

స్థానికంగానే పనులు

జిల్లాలో ఉపాధిహామీ పనులు పెద్ద ఎత్తున చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు స్థానికంగానే పనులు కల్పిస్తున్నాం. ఏ ఒక్కరూ పనులు లేవని జిల్లా నుంచి వలస వెళ్లకూడదన్నదే లక్ష్యం.

– శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ, తిరుపతి జిల్లా

నేడు అయోధ్యకాండ పారాయణం

తిరుమల: లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సోమవారం రెండో విడత అయోధ్యకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సాగనున్న ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. అయోధ్యకాండలోని 4 నుంచి 8వ సర్గల వరకు మొత్తం 174 శ్లోకాలను పారాయణం చేయనున్నారు. అలాగే యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంతో 25 శ్లోకాలను పఠించనున్నారు. మొత్తం 199 శ్లోకాలను ఎస్వీ వేద విజ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, సంభావన పండితులు, అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు పారాయణం చేయనున్నారు.

వైభవంగా ప్రదోష పూజలు



విశేషాలంకరణలో నందీశ్వరుడు

నాగలాపురం : మండలంలోని సురుటుపల్లెలో ఉన్న శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా ప్రదోష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని సేవించుకున్నారు. ఈ పూజలో పాల్గొంటే సర్వదోషాలు సమసిపోతాయని ఆలయ కమిటీ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈఓ రామచంద్రారెడ్డి పర్యవేక్షించారు.

భక్త ఆంజనేయుని సేవలో మంత్రి పెద్దిరెడ్డి



స్వామివారికి పుష్పమాలలు తీసుకువస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

చంద్రగిరి(తిరుపతి రూరల్) : శ్రీనివాసమంగాపురం వద్ద శ్రీవారి మెట్టు మార్గంలో కొలువైన శ్రీభక్త ఆంజనేయస్వామిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి మంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి దంపతులను అర్చకులు ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేత్ర దేవతకు టీటీడీ సారె

- సంప్రదాయబద్ధంగా సమర్పించిన మంత్రి ఆర్కే రోజా
- ప్రత్యేకత సంతరించుకున్న ఆడి బ్రహ్మోత్సవాలు



సారెను ఊరేగింపుగా తీసుకు వస్తున్న మంత్రి రోజా తదితరులు

నగరి : ఆడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నేత్ర దేవత శ్రీదేశమ్మ ఆలయానికి టీటీడీ తరఫున పట్టు వస్త్రాల సారెను రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా ఆదివారం సమర్పించారు. అమ్మవారికి టీటీడీ నుంచి సారె సమర్పించే సంప్రదాయాన్ని గత ఏడాది మంత్రి రోజా ప్రారంభించిన సంగతి విదితమే. పోతురాజు ఆలయం నుంచి సారెను తీసుకుని డప్పు, పంబ వాయిద్యాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా దేశమ్మ ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి, ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డికి ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రి అమ్మవారికి సారెను సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో అంబలిని సమర్పించారు. ఆడి బ్రహ్మోత్సవాలకు టీటీడీ సారె అందించే సంప్రదాయాన్ని తీసుకువచ్చి బ్రహ్మోత్సవాలకు మరింత కీర్తి చేకూర్చినందుకు మంత్రిని వేద మంత్రాలతో ఆశీర్వదించి, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. దుశ్శాలువలతో సత్కరించి ఆలయ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ దేవత దేశమ్మ ఆలయం నేత్రదేవత ఆలయంగా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం పూర్తిగా అందిస్తున్నట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేయగా, పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. అమ్మవారు ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థించానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈవో మునిశేఖర్, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, పలువురు కౌన్సిలర్లు, ధర్మకర్తలు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామికి ఆదివారం వేడుకగా వసంతోత్సవం నిర్వహించారు. తొలుత ముక్కంటి ఆలయంలోని వసంత మండపంలో స్వామి అమ్మవార్లను కొలువు దీర్చారు. చందనం, క్షీరం, పెరుగు, పసుపు, కుంకుమ, నారికేళ జలంతో విశేషంగా అభిషేకాలు జరిపించారు. దేవదేవేరులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అధికారులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం .ధ్వజావరోహణంతో ఆడికృత్తిక ఉత్సవాలను పరిపూర్ణం చేశారు.



స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. శని, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో స్వామివారి దర్శనార్థం భక్తులు అశేషంగా తరలి వచ్చారు. ఆదివారం ఉదయం నుంచే కంపార్ట్‌మెంట్‌లు, క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులు త్వరితగతిన దర్శనం చేసుకునేలా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, గర్భిణులను ప్రత్యేక క్యూల్లో దర్శనానికి అనుమతించారు.



నీ సేవకై వచ్చితి!

తిరుమల శ్రీవారిని ఆదివారం టీమ్ ఇండియా క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్‌శర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయం వెలుపల తమ అభిమాన క్రికెటర్‌ను చూసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

– తిరుమల

ఆత్మీయ స్వాగతం



శ్రీవారి దర్శనార్థం ఆదివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భుయాన్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి.

– రేణిగుంట

బాధ్యతగా ప్రజారోగ్య రక్షణకు కృషి



ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



తుమ్మలగుంట వైద్యశిబిరంలో ప్రజలను పలకరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : ప్రజారోగ్య రక్షణను బాధ్యతగా తీసుకున్నట్లు ఎమ్మెల్యే చెదిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తుమ్మల గుంట, ఉప్పరపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. వైద్య పరీక్షలకు విచ్చేసిన ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. రక్త నమూనా సేకరణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి మాట్లాడుతూ కరోనా తర్వాత ప్రతి ఒక్కరి ఆరోగ్య స్థితిగతుల్లో అనేక రకాల మార్పులు వచ్చాయన్నారు. ఈ క్రమంలో అందరూ రక్త పరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతులుగా జీవనం సాగించాలని సూచించారు. పరీక్ష చేయించుకున్న వారి మొబైల్ ఫోన్‌కు వారం రోజుల్లో టెస్ట్‌ల ఫలితాలు వస్తాయని వెల్లడించారు. ఆయా రిపోర్టుల ఆధారంగా వైద్యులు సేవలందిస్తారని వివరించారు.

సిరులతల్లి సేవలో టీటీడీ బోర్డు చైర్మన్



అమ్మవారి ఆలయంలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరు శ్రీపద్మావతీదేవిని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సతీసమేతంగా ఆదివారం సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుకుని అమ్మవారి మూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి శాలువాతో సత్కరించారు. జేఈఓ తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ యశ్వంత్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, బాబు స్వామి, ప్రసాదం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు: ఒకరి మృతి

నాగలాపురం : మండలకేంద్రంలోని పుత్తూరు– చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. చెన్నైలో లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సలీమ్(25), ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్(23) బైక్‌పై వస్తుండగా తిరుమలకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో సలీమ్ అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

జిజ్ఞాస భూమిక.. విజ్ఞాన వీచిక



చిట్టిబుర్రల్లో మెదిలే ఆలోచనలకు పదును పెడితే అద్భుతాలు సృష్టించవచ్చు. చిన్నారుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంపొందించేందుకు, నూతన ఆవిష్కరణల రూపకల్పనలను ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏటా 'ఇన్‌స్పైర్ అవార్డ్ మనక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వారిని బాల శాస్త్రవేత్తలుగా గుర్తిస్తోంది. ఈ విద్యాసంవత్సరం ఇన్‌స్పైర్ మనక్ పోటీల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. నామినేషన్ల దరఖాస్తు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

- ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం
- కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణలకు ఆవకాశం
- ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురి అవకాశం
- దరఖాస్తుకు ఈనెల 31 ఆఖరు
- వైజ్ఞానిక ప్రదర్శనలు పెరిగేలా అధికారుల అవగాహన

తిరుపతి జిల్లా సమాచారం

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు	2,108
చదువుతున్న విద్యార్థులు	1,55,220
ప్రాథమికోన్నత పాఠశాలలు	333
చదువుతున్న విద్యార్థులు	93,146
ఉన్నత పాఠశాలలు	622
చదువుతున్న విద్యార్థులు	59,871
మొత్తం పాఠశాలలు	3063
మొత్తం విద్యార్థులు	3,08,237

గత ఐదేళ్లలో ఇన్‌స్పైర్ ఎంపిక వివరాలు

సంవత్సరం	నామినేషన్‌లు	జిల్లా స్థాయిలో ఎంపికైనవి
2017-18	2550	835
2018-19	4780	1780
2019-20	5276	299
2020-21	5177	565
2021-22	6288	797
2022-23	6602	836



2020-21లో జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో ఎంపికైన విద్యార్థిని

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి బాల శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2009 నుంచి ఇన్‌స్పైర్ మనక్ పేరిట విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నాయి. నామినేషన్‌ల కసరత్తు పూర్తి అయిన తర్వాత జిల్లా స్థాయిలో పోటీల ప్రదర్శన నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన వారికి రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. అక్కడ ఎంపికైతే జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఇలా జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా గుర్తించి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేస్తారు. ఇన్‌స్పైర్ మనక్ 2023-24 సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల నుంచి నూతన ఆవిష్కరణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. జిల్లాల్లో అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 2023-24 సంవత్సరానికి దరఖాస్తులు చేసుకునేందుకు ఆగస్టు 31 వరకు అవకాశం కల్పించారు.

ఆరు నుంచి పదో తరగతి వరకు

జిల్లా వ్యాప్తంగా 2,881 వివిధ యాజమాన్యాల పాఠశాలలున్నాయి. వీటిల్లో 2,44,706 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇన్‌స్పైర్ మనక్ విజ్ఞాన మేళాలో పాల్గొనేందుకు జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రైవేటు, కస్తూర్బా, గురుకుల, ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసించే ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు అవకాశం ఉంటుంది. ఒక పాఠశాల నుంచి ఐదుగురికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. విద్యార్థి పూర్తి వివరాలతో పాటు ప్రదర్శించే ఎగ్జిబిట్‌కు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పర్చాలి. జిల్లా స్థాయిలో ఎంపికయ్యే వారికి రూ. 10 వేలు, రాష్ట్ర స్థాయికి ఎంపికైతే రూ.40 వేలు, జాతీయ స్థాయికి ఎంపికైన వారికి రూ.60 వేల నగదు బహుమతిని నేరుగా విద్యార్థి అకౌంట్‌లో జమ చేస్తారు.ఈ కసరత్తు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 ప్రాజెక్టులకు దరఖాస్తులు, ఉన్నత పాఠ శాల నుంచి 5 దరఖాస్తులు వచ్చేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. ఇన్‌స్పైర్ మనక్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్లను ఆవిష్కరించి పలు సూచనలు జారీచేశారు.

దరఖాస్తు విధానం ఇలా

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులో పాల్గొనేందుకు ప్రాజెక్ట్ వివరాలను పాఠశాల ఐడీ ద్వారా గడువులోపు www. inspireawards dst. gov. in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థి పాఠశాలకు సంబంధించిన వివరాలను పొందుపరచి సేవ్ చేయాలి. విద్యార్థుల దరఖాస్తు సంబంధిత జిల్లా అథారిటీకి చేరుతుంది. దరఖాస్తు ఆమోదించిన తర్వాత దరఖాస్తుదారు ఇచ్చిన ఈ మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది. దరఖాస్తుదారుకు వచ్చిన లింక్‌తో వచ్చిన ఐడీతో పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. అనంతరం విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఇన్‌స్పైర్ మనక్ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల్లో దాగి ఉన్న ఆలోచనలు, నైపుణ్యాలు వెలికితీసేందుకు మంచి వేదిక. పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. విద్యార్థుల మదిలో మెదిలే, సమాజంలోని సమస్యలకు సరికొత్త పరిష్కారాలు కనుగొనే విధంగా ప్రాజెక్టులుండాలి.

- వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి

గడువులోపు ప్రక్రియ పూర్తి చేయాలి



ఈనెల 31 లోపు ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు నామినేషన్ ప్రక్రియకు అవకాశం కల్పించాలి. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు గడువులోపు నామినేషన్‌ల ప్రక్రియను పూర్తి చేయాలి. అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలుంటాయ్. ఆసక్తి ఉన్న విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటేలా ప్రోత్సహించాలి.

- శేఖర్, డీఈఓ, తిరుపతి

మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి..



నామినేషన్లలో ఈ ఏడాది చిత్తూరు జిల్లాను జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తాం. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కసరత్తు చేపడుతున్నాం. 6 నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొనవచ్చు. అన్ని మేనేజ్‌మెంట్‌ల విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్‌లో ప్రాజెక్టుల ప్రతిపాదనలను నమోదు చేసుకోవాలి. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- వెంకటరమణ, జిల్లా సైన్సు అధికారి, చిత్తూరు.

ముగిసిన రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలు



ఎంపికైన బాలబాలికలతో నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి శ్రీనివాస స్పోర్ట్ కాంప్లెక్స్‌లోరెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ రోల్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలురు, బాలికల విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆరు జట్లుగా ఎంపిక చేశారు. త్వరలోనే వీరికి పోటీలు నిర్వహించి తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు రాష్ట్ర రోల్ బాల్ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి జి.ప్రతాప్, అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి వీజీ ప్రేమ్‌నాథ్, టెక్నికల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ షేక్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌రోడ్‌లో ప్రమాదం

తిరుమల : తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో ఆదివారం ఓ కారు అదుపు తప్పి పిట్టగోడను ఢీకొంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ఘాట్ రోడ్డు సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఏపీఎల్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రీడాకారులు

గూడూరురూరల్ : ఆంధ్ర ప్రీమియర్ సీజన్–2 పోటీల ప్రారంభోత్సవానికి పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్ క్లాక్,రైల్వే స్టేషన్, హాస్పిటల్ రోడ్డు, ఐసీఎస్‌రోడ్డు మీదుగా సాగింది. నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కె.మునిగిరీష్, క్రీడాకారుడు ఏకాక్షర్, గూడూరు క్రికెట్ క్లబ్ సెక్రటరీ నాగేశ్వరరావు, ఏసీఏ కోచ్ లవకుమార్, సీనియర్ క్రీడాకారులు మణి, వేగూరు రాజేంద్రప్రసాద్, సుబ్రమణ్యం, పి.కరీముల్లాఖాన్, సాజిద్, మహేష్, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మల గుంటలోని తుడా గ్రౌండ్‌లో ఏపీ రీజనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్, పెన్నా భాస్కర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ప్రవీణ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ఫుట్‌బాల్‌కు అత్యంత ఆదరణ ఉందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లు అనంతపురంలో నిర్వహించనున్న అంతర్ జోనల్ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, క్రీడాకారులు పి.రామచంద్రారెడ్డి, వి.మునయ్య, శ్రీనివాసులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



బాధితులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: మండలంలోని రాచపాళెంలో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంట్లోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు.. వేలు, భార్య ఆషా, పిల్లలు శివ, కరుణేష్‌తో శనివారం రాత్రి ఇంట్లో నిద్రపోతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. తలుపులు తీసుకుని బయటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు, బీరువాలో నగదు దగ్ధమయ్యాయి. సర్పంచ్ రూబెన్ అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పక్క ఇళ్లకు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెంటనే బాధితులను పరామర్శించారు. నిత్యావసర సరుకులతోపాటు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ స్కూల్ చైర్మన్ కె.చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచులు రూబెన్, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని 'త్రివర్ణం'



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా స్థానిక ముస్లిం నేతలు సిద్ధం చేసిన 150 అడుగుల జాతీయ జెండాను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనారిటీ సెల్ నేతలు, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ అబ్దుల్ ఆధ్వర్యంలో దేశభక్తిని చాటేలా భారీ జాతీయ జెండాను తయారు చేయడం శుభపరిణామమన్నారు. మహనీయుల త్యాగఫలం వల్లే నేడు మనం స్వేచ్ఛగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్ బాబు, నియోజకవర్గ మైనారిటీ సెల్ కన్వీనర్ సిద్దిక్, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి లతీఫ్, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, శ్రీకాళహస్తీశ్వర ట్రస్టు బోర్డు మెంబర్ పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యంరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, పార్టీ నాయకులు ఓడూరు ఉజ్వల్‌రెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.

నేదురుమల్లి కృషితోనే 'పండుగ'



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ తదితరులు

వెంకటగిరిరూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కృషితోనే వెంకటగిరి పోలేరమ్మ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. ఆదివారం పట్టణంలోని 12వ వార్డులో పోలేరమ్మ విరూప మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటగిరీయుల ఆకాంక్ష నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీఓ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పురపాలక పరిధిలో నిత్యం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహస్తున్నారన్నారు. దీంతో జాతర సంబరాలు అప్పుడే మొదలైన అనుభూతి కలుగుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎస్.బాలయ్య, చింతపట్ల ఉమామహేశ్వరి, విప్ పూజారి లక్ష్మి, పార్టీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు గోపాలకృష్ణ, సుబ్బారావు, మాడా జానకిరామయ్య, ఎ.శ్రీనివాసులు, స్థానిక నేతలు రొంటాల చిన్నా, చింతగింజల సుబ్రమణ్యం, నాగేంద్ర, మునెయ్య, ప్రకాష్, మల్లిరెడ్డి, గిరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3కే రన్



3కే రన్‌ను ప్రారంభిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

తిరుపతి సిటీ : చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ వారు ఆదివారం తిరుపతిలో నిర్వహించిన 3కే రన్ ఉత్సాహంగా సాగింది. ఉదయం 8గంటలకు ఎస్వీయూ తారకరామా స్టేడియం నుంచి క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి స్పోర్ట్స్ టార్చ్ వెలిగించి రన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్సార్ స్టేడియంలో మన ఆంధ్ర– మన ఏపీఎల్ (ఆంధ్రా ప్రీమియర్ లీగ్) సీజన్–2 ప్రారంభంకానున్న నేపథ్యంలో క్రీడాకారులకు మద్దతుగా 3కే రన్ చేపట్టినట్లు వెల్లడించారు. యువతలోని ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ క్రికెటర్లుగా తయారు చేయడమే ఏపీఎల్ క్రికెట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. క్రీడారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని వివరించారు. బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్, కృష్ణాపురం ఠాణా, గాంధీరోడ్డు వరకు 3కే రన్ ఉత్సాహంగా సాగింది.